## సిద్ధాంతి

వాక్చిత్రం : జి. సి. జీవి

"సోషలిజం, సోషలిజం అని గొంతు చించుకుంటున్నామే గాని, ఎక్కణ్ణుం వొస్తుందండీ అది? అసలు భగవంతుని సృష్టిలోనే లేదే సమానత్వం. రాత్రీ పగలూ, ఎండా వానా, కొండలూ లోయలూ; ఇక పశు పక్ష్యాదుల్లో చూస్తామా అంటే పులీ-మేకా, డేగా-పావురం. ఇంతెందుకు మనుషుల్నే తీసుకుందాం. ఒకడు పొట్టి, మరొకడు పొడుగు. ఒకడు నలుపు, మరొకడు తెలుపు. పోనీ మన చేతి వేళ్లు అయిదూ సమానంగా వున్నయేమో చూడండి. మరలాంటప్పుడు ఆర్థిక అసమానతలు పోవాలంటూ, మనుషుల్లో ఎక్కువ తక్కువ వుండకూడదంటూ వేదిక లెక్కి వుపన్యాసా లిచ్చి లాభమేమిటి చెప్పండి. కలిమిలేములూ, కష్టసుఖాలూ అన్నీ వున్నప్పుడే జీవితంలో వెరైటీ వుంటుందండీ బాబూ. ధనవంతులూ, దరిద్రులూ వున్నారే అంటే—వుంటారు మరి. డార్విన్ చెప్పిన 'సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్టు' సిద్ధాంతం చదివాం కదండీ. ప్రాణికోటి పరిణామ క్రమంలో బలంగల జీవాలే నిలిచాయని, బలహీనమైనవి అంతరించి పోతాయనీ చెప్ప లేదుటండీ. మనిషి జీవితంలోనూ అంతే మరి. సామర్థ్యం అనండి, ఉపాయం అనండి, తెలివితేటలనండి—ఇవి వున్నప్పుడు నాలుగు డబ్బులు పోగుజేసుకుని బాగుపడుతున్నాడు. లేనివాడు వెనకబడిపోయి లేనివాడుగానే మిగిలిపోతున్నాడు. దీనికి ఎవరేం చేస్తారు చెప్పండి."

బస్సు రాగానే వాగేశ్వర్రావు వాగ్ధోరణికి బ్రేకు పడింది. బస్సు ఖాళీగానే వచ్చి ఆగింది. క్యూ చెదిరిపోయింది. క్యూలో మొదటి వరుసలో అర్ధ గంటనించీ నిలబడి వున్న వాగేశ్వర్రావుని వెనక్కి నెట్టేసి జనం చెదురు మదురుగా లోపలికి చొరబడ్డారు. నిముషంలో బస్సులో సీట్లన్నీ నిండిపోయాయి. ఒగుర్చుకుంటూ బస్సులో కెక్కిన వాగేశ్వర్రావుకి కూర్చోడాని కెక్కడా సీటు దొరకలేదు. అతనికి కడుపు మండింది.

"ఛీ ! ఛీ ! బలం వుంది కదా అని క్యూలో ముందున్నవాళ్ళని వెనక్కి నెట్టేసి, చొరబడి సీట్లు ఆక్రమించుకోవడమే. ఇదేం న్యాయమని అడిగే నాధుడే లేడే. మనుషుల్లో రాన్రానూ అన్యాయం పెచ్చుపెరిగి పోతూందండీ బాబూ."

## లేఖలు

తెలుగు దేశంలో ఆధునిక సాహిత్యంపై సమీక్షలు, చర్చలు, విమర్శలు ప్రచురించే పత్రికలు కరువైనాయి. 'అభ్యుదయ' ఆ లోటును తీర్చగలదని విశ్వసిస్తున్నాను.

కడప జానమద్ది హనుమచ్ఛాస్త్రి

ప్రింటింగ్, గెటప్ చాలా బాగున్నాయి. 'మహోదయం' కవిత చాలా చప్పగా వుంది. 'విపరీత బుద్ధులు' సంపాదకీయం బాగుంది. రెండో పేజీలో యిచ్చిన కొద్ది ఉదాహరణలు యింకా ఎక్కువగా విపులంగా ముందు సంచికల్లోనైనా రావడం మంచిది.

విజయనగరం నిష్ఠల వెంకటరావు

విశేషాలు, వార్తలు, చర్చాగోష్ఠుల వివరాలు చాలా ఆసక్తికరంగానూ, సద్విమర్శనాత్మకంగానూ ఉన్నాయి. పత్రిక యిదివరకు ముందు వాటికన్నా ఎంతో మేలుగా ఉన్నది. మీరు చేస్తున్న కార్యక్రమాలు దేశంలోని పలువురు సాహిత్యాభిమానులకు, ముఖ్యంగా అభ్యుదయ కాముకులకు మార్గదర్శకంగానూ, ఉత్తేజాన్ని కలిగించేవిగానూ ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

వరంగల్ పేర్వారం జగన్నాథం

శ్రీ వెంకటేశ్వర ప్రింటర్స్, మద్రాసు-600021